https://teluguislam.net


# అధ్యాయం–13

## 265–284

## 13– ప్రియమైన దాసులకు అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు

- స్వర్గం అతి సౌందర్యమైనది
- స్వర్గంలో అందమైన మేడలు మరియు గుడారాలు
- స్వర్గం వృక్షాలు మరియు పండ్లూ ఫలాలు
- స్వర్గవాసులు తినే, త్రాగే పాత్రలు
- స్వర్గవాసులకు పుణ్యవతులైన భార్యలు
- స్వర్గ స్త్రీలకు పుణ్యభర్త మరియు గొప్ప సౌందర్యం అనుగ్రహించబడును
- స్వర్గవాసులకు ప్రాప్తమయ్యే శక్తి
- స్వర్గవాసుల కొరకు సేవకులు
- స్వర్గవాసులు అల్లాహ్‌ను దర్శించుకునే మహా భాగ్యం పొందుతారు
- తస్బీహ్, తక్బీర్ స్వర్గం అనుగ్రహాలు

https://teluguislam.net



# 13- ప్రియమైన దాసులకు అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు

స్వర్గం అంటే అల్లాహ్ తయారు చేసిన సర్వసుఖాలుగల శాశ్వత స్థానం. అది సుఖ సంతోషాలకు అంతు లేని ఒక నిలయం. దానిలో ఉన్న అనుగ్రహాలకు అంతు లేదు. అవన్ని స్వర్గనివాసుల కోసమే ప్రత్యేకించబడి ఉన్నాయి. దానిలో పోయే అదృష్టవంతులు అల్లాహ్ యొక్క ప్రవక్తలు. మరియు ఆ ప్రవక్తలను ఆయా కాలాలలో విశ్వసించి విధేయతను పాటించిన ప్రజలు. ఇంకా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వచ్చిన తరువాత ప్రపంచమంతటిలో ఉన్న ఏ జాతివారైనా, ఏ రంగులో ఉన్నవారైనా, స్త్రీలైనా, పురుషులైనా, అంటే ప్రళయం వరకు పుట్టబోయే మానవులంతా అల్లాహ్‌ను మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను విశ్వసించి, వారి ఆదేశాలకు అనుగుణంగా విధేయతను పాటించిన విశ్వాసులందరూ స్వర్గానికి ప్రవేశిస్తారనీ ఖుర్‌ఆన్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచనాల ద్వారా మనం స్పష్టంగా తెలుసుకున్నాము.

అల్లాహ్‌ను విశ్వసించిన సత్యమూర్తులు, అల్లాహ్ ప్రసన్నత కోసం పోరాడిన షహీదులు (అమరులు) మరియు పుణ్యకార్యాలు చేస్తూ చనిపోయిన విశ్వాసులందరూ అల్లాహ్ చిత్తంతో ఆయన కరుణ కటాక్షాలతో స్వర్గంలోనికి ప్రవేశిస్తారు.

ఇక్కడ మేము స్వర్గం యొక్క అందం మరియు దానిలో ఉన్న అనుగ్రహాల గురించి, అల్లాహ్ ఖుర్‌ఆన్ గ్రంథంలో మరియు ప్రవక్త

https://teluguislam.net



ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా స్వర్గం గురించి ప్రచురించబడిన హదీసుల వెలుగులో సంక్షిప్తంగా మీకు తెలియజేస్తాము. అయినా ఆ స్వర్గం ప్రత్యేకతల గురించి, దానిలో ఉన్న అనుగ్రహాల గురించి, ఎన్ని పుస్తకాలు రాసినా పూర్తి వాస్తవాలను మనం గ్రహించలేము. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రచురించిన ఒక హదీసే ఖుదిసి ఉంది. అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

**'దాన్ని (స్వర్గం) నా పుణ్య దాసుల కొరకు తయారు చేసాను. వాటిని ఏ కన్నూ కనలేదు. ఏ చెవీ వినలేదు. ఏ మానవుని మనస్సులో దాని ఊహ కూడా పుట్టలేదు.'**

ఆ తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): కావాలంటే మీరు అల్లాహ్ యొక్క ఈ ఆయతును చదవండని ఇలా వినిపించారు: **''వారి కర్మలకు ప్రతి ఫలంగా కళ్ళకు చల్లబరిచే ఎటువంటి సామగ్రి (అనుగ్రహాలను) వారి కొరకు దాచి పెట్టబడిందో (ఆ సామగ్రి గురించి) ఏ ప్రాణికీ తెలియదు.''**[1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''స్వర్గం (గోడలను) యొక్క ఒక ఇటుక బంగారం, మరొకటి వెండిది. దాని పూతలు సువాసన గల కస్తూరి, దాని కప్పు ముత్యాలు, మాణిక్యాలు. మరియు దాని మన్ను కుంకుమ పువ్వులతో తయారు చేయబడింది. ఎవరైతే దానిలో ప్రవేశిస్తారో శాశ్వతంగా ఉంటారు. వారికి మరణం లేదు. వారు సుఖసంతోషాలతో

---

[1] (32,సూరతు సజ్దా:17, బుఖారీ:4406, ముస్లిం:5050).

https://teluguislam.net



ఉంటారు. నిరాశ చెందరు. వారి యవ్వనం తరగదు. దుస్తులు మాసిపోవు.'' [1]

హజ్రత్ సహల్ ఇబ్నె సఅద్ అస్సాయిదీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **''స్వర్గంలో కొరడా పెట్టుకునే స్థలం ఈ ప్రపంచం కంటే దీనిలో ఉన్నవాటన్నిటి (అనుగ్రహాలన్నిటి) కంటే ఎంతో మేలైనది.''** [2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''స్త్రీలూ, సంతానమూ, వెండి, బంగారం రాశులూ, మేలు జాతి గుర్రాలూ, పశువులూ సేద్యభూములూ, వ్యామోహ వస్తువులూ (వగైరా) మానవులకు మనోహరమైనవిగా చేయబడ్డాయి. ఇదంతా ఇహలోకంలో ఇవ్వబడిన జీవన సంపదలు మాత్రమే. కాని శ్రేష్ఠమైన నివాసం అల్లాహ్ దగ్గరే లభిస్తుంది.

(ముహమ్మద్) వారికి ఇలా చెప్పు: ''వీటికంటే ఎంతో శ్రేష్ఠమైన వస్తువు లేమిటో చెప్పనా? భయభక్తులు కలవారికోసం సెలయేరులు, వాటి క్రిందుగా ప్రవహించే కాలువలు ఉంటాయి. దానిలో వారు శాశ్వతంగా (జీవించి) ఉంటారు. పరిశుద్ధ సతీమణులు లభిస్తారు. అల్లాహ్ ప్రసన్నత ప్రాప్తమవుతుంది. అల్లాహ్ తన దాసుల (నడవడికను) చూస్తూనే ఉన్నాడు.'' [3]

---

[1] (సహీహ్ తిర్మిజి:5226, అహ్మద్:7700).

[2] (బుఖారీ:3011).

[3] (3,ఆలి ఇమ్రాన్: 14–15).

https://teluguislam.net



హ౼్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

“స్వర్గంలో ఉన్న స్త్రీలలో నుండి ఒక స్త్రీ భూలోకానికి వచ్చిందంటే భూమ్యాకాశాల మధ్య ఉన్నవన్నీ ప్రకాశిస్తాయి. మరియు భూమ్యాకాశాల మధ్య ఉన్నవన్నీ సుగంధమైపోతాయి. ఆమె తన తలపై కప్పుకున్న ఒక పైట విలువ ఈ భూమ్యాకాశాలలో ఉన్నవాటన్నిటికంటే ఎంతో విలువైనది.”[1]

హ౼్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: “స్వర్గంలో ప్రవేశించేవారి శరీరాలలో వెంట్రుకలు ఉండవు. గడ్డము, మీసాలు ఉండవు. వారు (కళ్ళలో) సుర్మా పెట్టుకున్నట్టుగా ఉంటారు. స్వర్గవాసులు ముప్ఫైమూడు సంవత్సరాలు గల యుక్త వయస్సులో ఉంటారు.”[2]

హ౼్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబీ ఔఫా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: “నిద్ర మృత్యువుకు సోదరి వంటిది. కనుక స్వర్గవాసులు అక్కడ నిద్రపోరు.”[3]

ప్రపంచ హోదాలకంటే పరలోకంలో మరింత ఎక్కువగా హోదాలు, అంతస్తులు ఉంటాయి. విశ్వాసులుగా ఉన్న ప్రజలమధ్య అనేక అంతస్తులు ఉన్నట్లూ, ప్రవక్తల మధ్యలో కూడా అనేక అంతస్తులు ఉంటాయి.

---

[1] (బుఖారీ: 6083).

[2] (సహీహ్ తిర్మిజీ: 2545, సహీహ్ అల్‌జామి: 8072).

[3] (స్వర్గంలో మృత్యువు లేదు. అందుకనీ నిద్ర కూడా రాదు.) ( అత్తబ్రానీ:9061, సిల్‌సిలతుస్ సహీహ్: 1087).

https://teluguislam.net



కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘మేము ప్రవక్తలలో కొందరికి, ఇంకా కొందరి ప్రవక్తలకంటే ఉన్నత స్థానాలు ప్రసాదించాము. వారిలో కొంత మందికి (ప్రవక్తలతో) అల్లాహ్ స్వయంగా మాట్లాడాడు. ఇంకా కొంత మంది (ప్రవక్తల్ని) ఔన్నత్యాన్ని ఇచ్చి ఆదరించాడు. అలాగే మర్యం కుమారుడు ఈసాకు మేము స్పష్టమైన మహిమలు ప్రసాదించాము. పరిశుద్ధాత్మ (జిబ్రయీల్)ను పంపి అతనికి సహాయం చేసాము.’’ [1]

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

‘నిశ్చయంగా స్వర్గవాసులు తమపై నుండే మేడలలో ఉన్నవారిని మీరు ప్రాక్పశ్చిమ దిగ్మండలాలపై దేదీప్యమానంగా మెరిసే నక్షత్రాలను చూస్తున్నట్లు చూస్తారు. దీనికి కారణం స్వర్గవాసుల్లో కూడా అంతస్తులు ఉంటాయి’ అని అన్నారు.

ఈ విషయం విన్న అనుచరులు: ‘ఓ అల్లాహ్ ప్రవక్తా! ఈ మేడలు ప్రవక్తల గృహాలయి ఉంటాయా? వారు తప్ప అక్కడకు మరెవరూ పోలేరా?’ అని ప్రశ్నించారు.

అప్పుడు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం): ‘ఎందుకు చేరుకోలేరు! నా ప్రాణం ఎవరిచేతిలో ఉందో అతని సాక్షిగా! వీరసలు అల్లాహ్‌ను విశ్వసించి ఆయన ప్రవక్తలను సమర్థించినవారయి ఉంటారు’ అని అన్నారు. [2]

---

[1] (2,సూరతుల్ బఖరా: 253).

[2] (బుఖారీ:3016, ముస్లిం:5059).

https://teluguislam.net



హ౭్రజత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

“స్వర్గంలో వంద అంతస్తులు ఉన్నాయి. వాటిని అల్లాహ్ మార్గంలో పోరాడే వీరుల కొరకు సిద్ధం చేశాడు. ప్రతి అంతస్తుకు మధ్య వ్యత్యాసం, ఆకాశానికి భూమికి మధ్య ఉన్నంత వ్యత్యాసం ఉంది. మీరు అల్లాహ్‌ను వేడుకున్నప్పుడు ఫిర్‌దౌస్(అనే స్వర్గ అంతస్తును)ను వేడుకోండి. ఎందుకంటే అది స్వర్గంలో మధ్యస్థ (శ్రేష్ఠమైన) అంతస్తు మరియు అన్నిటికంటే పైఅంతస్తు కూడా ఇదే. దానిపైనే అల్లాహ్ సింహాసనం ఉంది. అక్కడి నుండే స్వర్గం నదులు పారుతాయి.” [1]

హ౭్రజత్ ముగైర బిన్ షుఅబా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

హ౭్రజత్ మూసా (అలైహిస్సలామ్) ప్రభువుతో: ‘స్వర్గం యొక్క అతిచిన్న స్థానం ఎలా ఉంటుంది?’ అని అడిగారు.

**అప్పుడు అల్లాహ్:** “స్వర్గవాసులకు స్వర్గం ప్రసాదించిన తరువాత ఒక వ్యక్తి నా వద్దకు వస్తాడు. అప్పుడు అతనికి స్వర్గానికి వెళ్ళు అని చెప్పబడుతుంది.

**అతను:** ఓ నా ప్రభూ! ‘నేను ఎలా పోయేది?’ అక్కడ ప్రజలు తమతమ స్థానాలకు చేరుకొని తీసుకోవలసినదంతా వారు తీసేసుకున్నారు. (ఇప్పుడు నాకేంముందనీ)? అంటాడు.

**తరువాత అల్లాహ్ అతనితో:** ‘ప్రపంచ రాజులకు ప్రసాదించినంత లోకాన్ని ప్రసాదిస్తే నీకు సంతోషమేనా’? అని అడుగుతాడు.

---

[1] (బుఖారీ:2581, తిర్మిజీ, అహ్మద్).

https://teluguislam.net



**అప్పుడు అతను:** 'నాకు సంతోషమే ప్రభూ!' అని అంటాడు.

**తరువాత అల్లాహ్:** 'నీకు అది (ప్రపంచమంతటి స్వర్గం) మరియు అలాంటిదే, మరియు అలాంటిదే, మరియు అలాంటిదే, మరియు అలాంటిదే, (ప్రపంచంవంటి ఐదు రెట్లు) ప్రసాదించాను' అని అనగా, **ఐదవసారి అతను:** 'ఓ ప్రభూ! నేను సంతోషించాననీ' అంటాడు.

**మరలా అల్లాహ్ అతన్ని:** 'నీకు అలాంటిదే పదిరెట్లు ప్రసాదించాను. మరియు నీ మనస్సుకు తోచినటువంటిదంతా, నీ కళ్ళకు రుచిగా ఉన్నటువంటిదంతా ప్రసాదించాను' అని అల్లాహ్ అంటాడు.

**ఆ తరువాత అతను:** 'ఓ ప్రభూ! నేను సంతోషించాను' అని అంటాడు...[1]

## స్వర్గం అతి సౌందర్యమైనది:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఎవరైతే సత్యాన్ని విశ్వసించి, మంచి కర్మలు చేస్తారో, వారి కొరకు ప్రవహించే నదులు స్వర్గవనాలు ఉన్నాయనీ శుభవార్తను వినిపించండి.'' [2]

హ్రజత్ అనస్ బిన్ మాలిక్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ........... **''నేను స్వర్గానికి పోయాను. అక్కడ ముత్యాల హారాలు ఉన్నాయి. మరియు అక్కడ ఉండే మన్ను మిస్క్''** (సుగంధాలు) అని తెలిపారు. [3]

---

[1] (ముస్లిం:276).

[2] (2,సూరతుల్ బఖర: 25).

[3] (బుఖారీ:336).

https://teluguislam.net



హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్ను అమ్ర్ (రజియల్లాహు అన్హు) కథనం. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచించారు:

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజియల్లాహు అన్హు) కథనం. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''హిన్నా (అనే సుగంధం) స్వర్గంలో అతి గొప్పది.''[1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **''సైహాన్, జీహాన్, ఫురాత్** మరియు **నీల్** అనే నదులన్నీ స్వర్గం నదులు.''[2]

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''సిద్‌రతుల్ మున్‌తహా (రేగి చెట్టు) వద్దకు నన్ను తీసుకు పోయారు. అక్కడ నేను నాలుగు నదులను చూసాను. రెండు నదులేమో బహిర్గతమ్మై ఉన్నాయి. రెండు నదులేమో దాగి ఉన్నాయి. బహిర్గతమ్మై ఉండే నదులు నైలు, ఫురాత్. దాగి ఉన్న మరో రెండు నదులేమో స్వర్గంలో ఉన్నాయి...''[3]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''(ముహమ్మద్) మేము నీకు కౌసర్ (సరోవరం) ప్రసాదించాము.''[4]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నిశ్చయంగా సజ్జనులు (స్వర్గంలో) కర్పూర జలం కలిపిన మధుపాత్రలను సేవిస్తారు. ఇది

---

[1] (సిల్‌సిలతుస్ సహీహ్: 1420).

[2] (ముస్లిం:5073).

[3] (బుఖారీ:5179).

[4] (108,సూరతుల్ కౌసర్:1).

https://teluguislam.net



ప్రవహించే ఒక సెలయేరు. అల్లాహ్ దాసులు దాని నీటితో పాటు మద్యం సేవిస్తారు. వారు దాని పాయలను (ఆ సెలయేర్లను తమ అనుకూలంగా కావలసిన చోటుకు) శాఖలుగా తీసుకుంటారు.'' [1]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు:''భయభక్తులు కలవారికి వాగ్దానం చేయబడిన స్వర్గం ఎలా ఉంటుందంటే? దానిలో ఎన్నటికి కలుషితంకాని నీటి సెలయేరులు ఉంటాయి. మరియు ఎన్నటికి రుచి మారని పాల నదులు ఉంటాయి. మరియు త్రాగుటకై అమిత రుచిగల మద్యం నదులు ఉంటాయి. స్వచ్ఛమైన తేనె నదులు ఉంటాయి.''[2]

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:
''నేను స్వర్గంలో నడుస్తూ పోతుండగా ఒక చోట నదిని చూసాను. దాని ఇరుప్రక్కల గోపురాలుగా ఉన్న ముత్యాల గుడారాలున్నాయి. (వాటిని చూసి) ఇదేమిటీ? ఓ జిబ్రయాల్! అని అడిగాను. ఆయన (జిబ్రయిల్): ''ఇది కౌసర్ నీరు మీ ప్రభువు మీకు ప్రసాదించాడు.దాని(హౌజే కౌసర్) మట్టి లేక దాని సుగంధం కస్తూరి.(వంటిది)'' అని తెలిపారు. [3]

స్వర్గం మట్టి కస్తూరి సువాసనకన్నా ఎంతో మేలైనదిగా ఉంటుంది. అందులో ఉన్న నీరు పాలు తెల్లదనముకన్నా అతి తెల్లగా ఉంటుంది. ఆ పాలు తేనెకంటే ఎంతో తియ్యగా ఉంటుంది. ఆ స్వర్గంలో కంకరాళ్ళకు బదులు వజ్రాలు మాణిక్యాలు ఉంటాయి. అలా పలు విధాలుగా వీటి ఔనత్యం గురించి నిజమైన హదీసులున్నాయి.

---

[1] (76,సూరతుత్ దహర్: 5-6).
[2] (47,సూరతు ముహమ్మద్: 15).
[3] (బుఖారీ:4582).

https://teluguislam.net



## స్వర్గంలో అందమైన మేడలు మరియు గుడారాలు:

హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్ను ఖైస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''విశ్వాసి కొరకై స్వర్గంలో ఒక గోపురంలా ఉన్న ముత్యం గుడారము ఉన్నది. అది అరవై మైళ్ల పొడువు ఉంటుంది. విశ్వాసుని కొరకు దానిలో భార్యలు ఉంటారు. వారు ప్రతి భార్య దగ్గరకు పోతూ వస్తూ ఉంటారు. కాని ఒకరి (స్త్రీ) వద్దకు పోతే మరొకరు (స్త్రీ) చూడజాలరు.'' [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''జిబ్రయీల్ అలైహిస్సలామ్ ప్రవక్త ముహమ్మద్ (స) వద్దకు వచ్చి:

''ఓ అల్లాహ్ ప్రవక్తా! ఇదిగో ఖదీజా వస్తున్నారు. ఆమె చేతిలో ఒక గిన్నె ఉంది, దానిలో కూర మరియు అన్నం ఉంది. ఆమె మీ వద్దకు వచ్చిన తరువాత అల్లాహ్ మరియు నేను సలామ్ చెప్తున్నామనీ తెలుపండి.

మరియు **'ఆమె కొరకై స్వర్గంలో ముత్యం కుటీరం ఉందనీ సువార్తనివ్వండి'** అక్కడ ఎలాంటి అరుపులు కేకలు ఉండవు. మరియు వారికి ఎలాంటి అలసట కలగదు.'' [2]

## స్వర్గం వృక్షాలు మరియు పండ్లూ ఫలాలు:

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''స్వర్గంలో ఒక మహా వృక్షం

---

[1] (బుఖారీ:4501, ముస్లిం:5070).

[2] (బుఖారీ:1666, ముస్లిం:4460).

https://teluguislam.net



ఉంది. దాని నీడలో ఒక రౌతు వందేళ్ళు నడిచినా! దాని చివరి నీడ వరకు చేరుకో లేడు.'' [1]

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **''తూబా అనే వృక్షం** స్వర్గంలో ఉంది. ఆ వృక్షం వందేళ్ళు నడిచినంత (పెద్దదిగా) ఉంది. ఆ వృక్షం కొమ్మల నుండి స్వర్గవాసుల కొరకు దుస్తులు వెలువడుతాయి.'' [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''స్వర్గంలో ప్రతి వృక్ష మూలము (మొదలు) బంగారపు ఉంటాయి'' [3]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) (ఓ విశిష్ఠ) రేగి చెట్టు సమీపానికి చేరి ఆగిపోయారు. ఆ రేగి పండ్లు హజర్ అనే పట్టాణానికి చెందిన కడవల్లా (పెద్దవిగా) ఉన్నాయి. దాని ఆకులు ఏనుగు చెవుల్లా (పెద్దవిగా) ఉన్నాయి. ఆ ఆకు (విశాలం) ఈ ఉమ్మత్‌ను (పూర్తిగా) కప్పుకునేటట్టు ఉంది. ఆ చెట్టు అనేక (అద్భుతమైన) రంగులతో చుట్టు ముట్టి ఉంది. అవి ఎలాంటి రంగులో నాకు (సరిగ్గా) తెలియవు. తరువాత నన్ను స్వర్గానికి తీసుకుపోయారు. అక్కడ నేను ముత్యాల గుడారాలను చూసాను. ఆ గుడారం మన్ను **'మిస్క్'** (అనే విశిష్ఠ సుగంధం).'' [4]

---

[1] (బుఖారీ:3012, ముస్లిం:5054).

[2] (సిల్‌సిలతుస్ సహీహ్: 1985).

[3] (సహీహ్ తర్‌గీబ్ వత్ తర్‌హీబ్: 3732).

[4] (అల్ జామీ సగీర్ వజియాదహ్: 7648, సహీహ్ అల్ జామీ: 4199).

https://teluguislam.net



పండ్లు ఫలహారాల గురించి ఖుర్ఆన్ గ్రంథంలో అనేక చోట్ల అల్లాహ్ తెలియజేశాడు: "ఆ ఉద్యానవనాలలో పండ్లూ ఫలాలు, ఖర్జూరాలు మరియు దానిమ్మపండ్లు (పుష్కలంగా) ఉంటాయి." [1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: "వారు ముళ్ళు లేని రేగి చెట్లు, అరటి పండ్ల గెలలు విశాలంగా వ్యాపించి ఉండే నీడలు, ఎల్లప్పుడు ప్రవహించే నీరు, ఎన్నటికీ అంతంకాని, నిరాటకంగా లభించే అసంఖ్యాకమైన పండ్లు వాటి మధ్య ఉంటాయి." [2]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: "వారు కోరిన పండ్లు ఫలాలు ఉన్నాయి. అలాగే వారు అతి ఇష్టంగా తినే పక్షుల మాంసమూ ఉన్నది." [3]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: "ఆ వనాలలోని ఉండే పండ్లను తినుటకై ఇవ్వబడినప్పుడెల్లా వారు ఇలా అంటారు: **'అరే ఇలాంటి పండ్లే కదా పూర్వం తిన్నది!.** వారికి (వివిధ రుచి గల) అలాంటి పండ్లే ప్రసాదించబడుతాయి. అవి ఒకదానికి ఒకటి పోలి ఉంటాయి." [4]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: "హాయిగా తినండి, త్రాగండి గత జీవితంలో మీరు చేసుకున్న (సత్కర్మల)కు ప్రతిఫలంగా అనుభవించండి." [5]

## స్వర్గవాసులు తినే, త్రాగే పాత్రలు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: వారి ముందు బంగారు పళ్లాలూ, గిన్నెలూ త్రిప్పబడుతాయి. వారి మనస్సు ఇష్టపడే, కళ్లకు ఇంపుగా ఉండే

---

[1] (55,సూరతుర్ రహ్మాన్: 68).

[2] (56,సూరతుల్ వాఖియ: 28–33).

[3] (56,సూరతుల్ వాఖియ: 20–21).

[4] (2,సూరతుల్ బఖర: 25).

[5] (69,సూరతుల్ హాఖ్ఖ: 24).

https://teluguislam.net



ప్రతి వస్తువూ అక్కడ ఉంటుంది. (వారితో ఇలా అనబడుతుంది) ''ఇక మీరు ఇక్కడే శాశ్వతంగా ఉంటారు.'' [1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వారి ముందు వెండి పాత్రలు గాజు గ్లాసులు త్రిప్పబడుతాయి. ఆ గాజు గ్లాసులు కూడా వెండిలా ఉంటాయి. అవన్ని సరైన లెక్క ప్రకారం నింపబడి ఉంటాయి. అక్కడ వారికి సొంటి కలిపిన మధుపాత్రలు ఇవ్వబడుతాయి.''[2]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వారి సమావేశాలలో నిత్యం బాల్యంకల బాలురు, మధువు ప్రవహించే చెలమనుండి నింపిన మధుపాత్రలు, గిన్నెలు, గాజు పాత్రలు, కూజాలు తీసుకొని అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు. ఆ మధువు సేవిస్తే వారికి ఏ మాత్రం మైకం కమ్మడం గాని, బుద్ధి మందగించడం గాని జరగదు.'' [3]

## స్వర్గవాసులకు పుణ్యవతులైన భార్యలు:

ఒక ముస్లిం స్వర్గంలో చేరుకున్న తరువాత అతని భార్య పుణ్యస్త్రీగా ఉన్నట్లయితే స్వర్గంలో అతనికి కూడా భార్యగా ఉంటుంది. కనుక అల్లాహ్ ఇలా ప్రకటించాడు: ''సజ్జనులైన తాత ముత్తాతలు, వారి తల్లిదండ్రులు, భార్యా పిల్లలు శాశ్వత స్వర్గవనాలలోకి పోతారు.'' [4]

మరియు అల్లాహ్ ఇలా ప్రకటించాడు: ''వారు వారి భార్యలు దట్టమైన నీడల క్రింద ఆసనాలపై దిండ్లకు ఆనుకొని కూర్చుని ఉంటారు.'' [5]

---

[1] (43,సూరతు జుఖ్రుఫ్: 70–71).
[2] (76,సూరతుత్ దహర్: 15–16).
[3] (56,అల్ వాఖిఅ: 17–19).
[4] (13,సూరతు రఅద్: 23).
[5] (36,సూరతు యాసీన్: 56).

https://teluguislam.net



ఒక స్త్రీకి తన చివరి జీవితంలో ఎవరైతే భర్తగా ఉంటారో! ఆ వ్యక్తికే ఆమె భార్యగా స్వర్గంలో ప్రసాదించబడుతుంది. అంటే విడాకుల వలనో లేక భర్త చనిపోయిన కారణంగానో ఆ స్త్రీ మరో వివాహం చేసుకోవడం వలన మొదటి భర్తకు భార్యగా ఉండదు. అందరికంటే చివరిగా ఉన్న భర్తకు మాత్రమే ఆ పుణ్య స్త్రీ భార్యగా లభిస్తుంది.

హజ్రత్ హుజైఫా (రజియల్లాహు అన్హు) తన సతీమణితో ఇలా తెలియజేశారు: ‘‘నీవు నాతో స్వర్గంలో కూడా భార్యగా ఉండాలనుకుంటే నేను చనిపోయిన తరువాత వివాహం చేసుకోకూ. ఎందుకంటే ఒక స్త్రీ స్వర్గంలో తన చివరి భర్తకు మాత్రమే లభిస్తుంది.... [1]

## స్వర్గ స్త్రీలకు పుణ్యభర్తలు మరియు గొప్ప సౌందర్యం అనుగ్రహించబడును:

ప్రతి స్త్రీ అందంగా ఉండాలనీ, వృధ్యాప్యానికి దగ్గర కాకూడదనీ, యుక్త స్త్రీలుగానే ఉండాలనీ ఆశిస్తారు. వారి ఈ ఆశలన్నీ స్వర్గంలో నెరవేర బోతాయి. వారి గుణాలు ధర్మపరంగా ఉంటే కన్యలుగా స్వర్గానికి ప్రవేశిస్తారు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘వారిని (స్త్రీలను) మేము ప్రత్యేక పంథాలో సరికొత్తగా సృజిస్తాము. వారిని మేము నిత్య నూతన కన్యలుగా రూపొందిస్తాము.’’ [2]

హజ్రత్ హసన్ బస్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ఒక వృద్ధురాలు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి:

**ఓ ప్రవక్తా!** ‘నేను స్వర్గానికి ప్రవేశించాలనీ మీరు అల్లాహ్‌ను వేడుకోండి’ అని అన్నది.

[1] (బైహఖి, సిల్‌సిలతుస్ సహీహ: 1281).
[2] (56,సూరతుల్ వాఖిఆ: 35–37).

https://teluguislam.net



దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): 'నిశ్చయంగా వృద్ధులు స్వర్గానికి పోరు' అని సమాధానమిచ్చారు.

తరువాత ఆమె: 'ఏడ్చుకుంటూ తిరిగి వెళ్లిపోయింది.'

తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): 'వృద్ధురాలిగా ఆమె స్వర్గంలోకి పోదు. అంటూ అల్లాహ్ ఈ ఆయతు: ''వారిని (స్త్రీలను) మేము ప్రత్యేక పంథాలో సరికొత్తగా సృజిస్తాము. వారిని మేము నిత్య నూతన కన్యలుగా రూపొందిస్తాము'' అనే శుభవార్తను ఆమెకూ ఇవ్వండనీ అనుచరులకు ఆదేశించారు. [1]

ఇహలోక స్త్రీలు స్వర్గంలో ప్రవేశిస్తే 'హూరున్ ఐన్' (అప్సరసల) కంటే ఎక్కువ అందంగా ఉంటారు. తమ తమ భర్తలతో మహారాణులుగా ఉంటారు. పెళ్ళిళ్ళు చేసుకోకుండా ఉండిపోయినవారు లేక పెళ్ళిళ్ళు చేసుకోక ముందే చనిపోయినవారు , లేక విడాకులకు గురికాబడి భర్తలు లేని స్త్రీలందరికీ స్వర్గంలో వివాహం చేయబడును. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ ఇలా ప్రవచించారు: ''స్వర్గంలో ఎవ్వరు కూడా ఒంటరిగా (పెళ్ళికాకుండా) ఉండరు.'' [2]

స్వర్గవాసులకై అందమైన (అప్సరసలు) కన్యలు భార్యలుగా ప్రసాదించబడుతారు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అలాగే మేము పెద్ద కళ్ళుగల హూర్లను వివాహం చేస్తాము.'' [3]

---

[1] (షమాయిల్ తిర్మిజీ, లిల్ అల్‌బానీ: 205).
[2] (ముస్లిం:5062).
[3] (44,సూరతు దుఖ్ఖాన్: 54).

https://teluguislam.net



మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరియు (స్వర్గంలో) సమవయస్కులైన సుకన్యలు ఉన్నారు.'' [1]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వారి కోసం అక్కడ అందమైన కళ్ళుగల హూర్‌లు ఉంటారు. వారు దాచిపెట్టిన ఆణిముత్యాల మాదిరిగా (ఎంతో అందంగా) ఉంటారు.'' [2]

''దానిలో సిగ్గు లొలికించే స్వర్గ కన్యలు ఉంటారు. వారిని ఈ స్వర్గవాసులకు పూర్వం ఏ మానవుడుగాని జిన్‌గాని తాకనైన తాకి ఉండడు.'' [3]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''స్వర్గంలో ఉన్న సతీమణులు (హూర్లు) వారి భర్తల కొరకై పాటలు పాడుతారు. ఎవ్వరు కూడా  అలాంటి (అద్భుతమైన సంగీతం) రాగం ఇంతవరకు విని ఉండరు. **అక్కడ వారు పాడే కొన్ని పదాలు ఇలా ఉంటాయి:**

'మేము సద్గుణ సంపత్తితో కూడిన సౌందర్యవంతులైన సతీమణులం. మర్యాదలు గల ప్రజలకు మేము భార్యలం. వారు చల్లటి కళ్ళతో చూస్తుంటారు.''

**ఇంకా ఇలా పాడుతారు.** 'మేము కలకాలం ఉంటాం మాకు మృత్యువు లేదు. మేము శాంతితో ఉన్నాము. మాకు ఎలాంటి భయం లేదు. మేము (ఇక్కడ) కలకాలం ఉంటాము. తిరిగి వెళ్ళిపోయే వారం కాము.'' [4]

---

[1] (78,సూరతున్ నబా: 33).

[2] (56,సూరతుల్ వాఖిఆ: 22–23).

[3] (55,సూరతుర్ రహ్మాన్: 56).

[4] (తబ్రానీ:489, సహీహ్ తర్‌గీబ్ వత్ తర్‌హీబ్: 3749).

https://teluguislam.net



హ్రజత్ ముఆజ్ బిన్ జబల్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘ఇహలోకంలో భర్తను వేధించే స్త్రీలకు స్వర్గంలో ఉన్న హూరుల్ ఐన్: ‘‘అల్లాహ్ నిన్ను నాశనము చేయుగాక! అతన్ని వేధించకే. అతను నీ వద్ద ఒక పరిమిత కాలం వరకే ఉండేది. అతిత్వరలోనే అతను నీ నుండి దూరమ్మై మా వద్దకు వచ్చేస్తాడు’’ అని అంటుంటారు. [1]

## స్వర్గవాసులకు ప్రాప్తమయ్యే శక్తి :

హ్రజత్ జైద్ బిన్ అర్ఖమ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘నా ప్రాణం ఎవరి చేతిలో ఉందో ఆ శక్తిమంతుని సాక్షిగా! (స్వర్గంలో) ఉన్న ప్రతి ఒక్కరికి తినుటక్కై, త్రాగుటక్కై, కోరికలు తీర్చుకొనుటక్కై, సంభోగించుటక్కై వంద మందికి (సమానమ్మైన) శక్తి ప్రసాదించబడుతుంది.... [2]

## స్వర్గవాసుల కొరకు సేవకులు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘వారి సమావేశాలలో నిత్యం బాల్యంకల బాలురు, మధువు ప్రవహించే చెలమనుండి నింపిన మధుపాత్రలు, గిన్నెలు, గాజు పాత్రలు, కూజాలు తీసుకొని అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు. ఆ మధువు సేవిస్తే వారికి ఏ మాత్రం మైకం కమ్మడం గాని, బుద్ధి మందగించడం గాని జరగదు.’’ [3]

---

[1] (సహీహ్ ఇబ్ను మాజ: 2014, సహీహ్ తిర్మిజీ: 1174).

[2] (అహ్మద్:18469, సహీహ్ తర్‌గీబ్ వత్ తర్‌హీబ్: 3739).

[3] (56అల్ వాఖిఅ: 17–19).

https://teluguislam.net



మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వారి (స్వర్గవాసుల) సేవకోసం నిత్యబాలురు అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు. మీరు వారిని (పిల్లల్ని) చూస్తే వెదజల్లబడిన ఆణిముత్యాల్లా కనిపిస్తారు.'' [1]

## స్వర్గవాసులు అల్లాహ్‌ను దర్శించుకునే మహా భాగ్యం పొందుతారు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''భయభక్తులు కలవారికోసం సెలయేరులు, వాటి క్రిందుగా ప్రవహించే కాలువలు ఉంటాయి. దానిలో వారు శాశ్వతంగా (జీవించి) ఉంటారు. పరిశుద్ధ సతీమణులు లభిస్తారు. అల్లాహ్ ప్రసన్నత ప్రాప్తమవుతుంది. అల్లాహ్ తన దాసుల (నడవడికను) చూస్తూనే ఉన్నాడు.'' [2]

హజ్రత్ అబూ సయీద్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**అల్లాహ్ స్వర్గవాసుల్ని:** 'స్వర్గవాసులారా!' అని పిలుస్తాడు.

**దానికి స్వర్గవాసులు:** 'మేము నీ సమక్షంలో హాజరయ్యాము ప్రభూ!' అనంటారు.

**అల్లాహ్:** 'మీరు సంతోషంగా ఉన్నారా?' అని అడుగుతాడు.

**దానికి స్వర్గవాసులు:** 'మేమిక సంతోషంగా ఎందుకు ఉండము? నీవు నీ సృష్టిరాసుల్లో ఎవరికీ ప్రసాదించని మహాభాగ్యాలు మాకు ప్రసాదించావనీ' అంటారు.

---

[1] (76,సూరతుత్ దహర్: 19).

[2] (3,ఆల ఇమ్రాన్: 15).

https://teluguislam.net



**అల్లాహ్:** 'నేను మీకు ఇంతకన్నా శ్రేష్ఠమైన మహాభాగ్యం ప్రసాదిస్తాన' నీ అంటాడు.

**స్వర్గవాసులు:**'ప్రభూ! ఇంతకన్నా శ్రేష్ఠమైన మహాభాగ్యం ఇంకేముంటుందనీ?' అంటారు.

**అప్పుడు అల్లాహ్:** 'నేను మీకు నా ప్రసన్నతా మహాభాగ్యం ప్రసాదిస్తాను. ఇక నుండి నేను ఎన్నడూ మీ మీద ఆగ్రహించను' అని అంటాడు. [1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఆ రోజు కొందరి ముఖాలు కళకళలాడుతూ మెరసిపోతుంటాయి. వారు తమ ప్రభువును ప్రత్యక్షంగా చూస్తుంటారు.'' [2]

హజ్రత్ సుహైబ్ రూమి (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: స్వర్గవాసులు స్వర్గంలో ప్రవేశించిన తరువాత వారిని:

**అల్లాహ్ అడుగుతాడు:** 'మీరు ఏమైన కోరుకుంటారా!' మరింత ఎక్కువ ప్రసాదిస్తాను.

**స్వర్గవాసులు:** 'ఓ అల్లాహ్! నీవు మా ముఖాలను ప్రకాశింపజేయలేదా! మమ్మల్నీ స్వర్గంలో ప్రవేశింపజేయలేదా! మమ్మల్నీ నరకాగ్ని నుండి రక్షించలేదా! (సర్వసుఖాలను ప్రసాదించావనీ)' అని అంటారు.

తరువాత (అల్లాహ్‌కు స్వర్గవాసులకు మధ్య ఉన్న) అడ్డు తొలగించబడును. అప్పుడు **వారి కళ్ళకు; 'అల్లాహ్ దర్శనంకంటే అతి ప్రియమైన అనుగ్రహం ఏది ఉండదు.''** [3]

---

[1] (బుఖారీ:6067, ముస్లిం:5057).

[2] (75,సూరతుల్ ఖియామా: 22-23).

[3] (ముస్లిం:226).

https://teluguislam.net



# తస్‌బీహ్, తక్బీర్ స్వర్గం అనుగ్రహాలు:

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ప్రతి (స్వర్గవాసి మనసులో) తస్‌బీహ్ మరియు తక్బీర్ పదాలు పలికేటట్లూ నింపేయబడును. ఎలాగైతే శ్వాసను (మనసులో) నింపేయబడిందో.''[1]

స్వర్గంలో ఎలాంటి ఆరాధనలు చేయుటకై నిబంధన లేనప్పటికీ తస్‌బీహ్ మరియు తక్బీర్ పదాలు స్మరిస్తూనే ఉంటారు. అక్కడ వారు తీసుకొనే శ్వాసయే తస్‌బీహ్ మరియు తక్బీర్ పదాలుగా ఉంటాయి. ఎందుకంటే వారు అల్లాహ్‌ను చూసిన తరువాత వారి మనసులు కాంతితో మరియు ప్రేమతో నిండిపోతాయి. ఏ వ్యక్తినైతే ఎంత ఎక్కువగా ప్రేమిస్తారో, వారిని అంత ఎక్కువగా తలుచుకుంటూ ఉంటారు. ఒక స్వర్గవాసి అల్లాహ్ కంటే ఎక్కువగా మరెవరిని తలుచుకుంటాడు?

అందుకనీ: **'లా ఇలాహ్ ఇల్లల్లాహ్, సుబ్‌హానల్లాహ్, అల్లాహు అక్బర్'** అనే పదాలు నిరంతరాయంగా, అనుక్షణం పలుకుతూనే ఉండాలి.

**"وآخر دعوانا عن الحمد لله رب العالمين"**

మేము మా: **''సర్వస్తోత్రాలకు అర్హుడు, సమస్తలోకాల పోషకుడైన అల్లాహ్ మాత్రమే!''** అన్న అంగీకారంతో ముగించుకుంటున్నాము.

[1] (ముస్లిం:5066).